క్లుప్తంగా

తహసీల్దార్‌కు సత్కారం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు తహసీల్దార్ నాగరాజును శనివారం మధ్యాహ్నం రెవెన్యూ కార్యాలయం ఉద్యోగులు ఘనంగా సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల విధులను తహసీల్దార్ నాగరాజా సమర్థవంతంగా నిర్వర్తించి, ప్రస్తుతం సొంత జిల్లాకు బదిలీపై వెళుతుండడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సోమశేఖర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ అన్వర్ బాషా, ఆర్ఐ శివకుమార్ పాల్గొన్నారు.

సాఫ్ట్ స్కిల్స్‌తో బంగారు భవిత

తిరుపతి సిటీ: విద్యార్థినుల బంగారు భవితకు అకడమిక్ విద్యతో పాటు సాఫ్ట్ స్కిల్స్ ముఖ్యమని డీన్ ప్రొఫెసర్ సి.వాణి తెలిపారు. శ్రీపద్మావతీ మహిళా వర్సిటీ కెరీర్ కౌన్సిల్ సెల్, ఏపీ ఐటీ అకాడమీ తరఫున నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరురోజులుగా నిర్వహిస్తున్న సాఫ్ట్ స్కిల్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ శనివారంతో ముగిసింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వాణి మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో నిలబడాలంటే విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ అవసరమని వెల్లడించారు. శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ప్రొఫెసర్ కిషోరి, లక్ష్మీప్రసాద్, భూపతిరాజు, ప్రియ, వజీహాభాను, రజని, రాజ్యలక్ష్మి, సౌమ్య పాల్గొన్నారు.

ఉపకార వేతనం పెంచాలని వినతి



వీసీని సన్మానిస్తున్న విద్యార్థి విభాగం నాయకులు

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో పనిచేస్తున్న జూడాలకు ఉపకారవేతనం పెంచాలని బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాగేశ్వరరావు కోరారు. శనివారం ఈ మేరకు ఇన్‌చార్జి వీసీ జేవీ రమణను సన్మానించి వినతి పత్రం అందించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ వర్సిటీలో పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జే ఎజ్రా, జయ భారత్ నేషనల్ పార్టీ రాయలసీమ అధ్యక్షుడు భార్గవ్ కుమార్, పార్థసారథి, వినయ్, ఆదర్శ్, శ్యామ్, సుధీర్, చిద్విలాస్, ధనుష్ పాల్గొన్నారు.

అర్బన్ తహసీల్దార్‌కు సత్కారం



నారాయణరెడ్డిని సన్మానిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

తిరుపతి అర్బన్: ఎన్నికల సమయంలో జిల్లాకు బదిలీపై వచ్చిన 34 మంది తహసీల్దార్లు రిలీవ్ అయ్యారు. ఈ క్రమంలో తిరుపతి అర్బన్ తహసీల్దార్ నారాయణరెడ్డి తిరిగి సొంత జిల్లా వైఎస్సార్ కడపకు బదిలీపై వెళుతున్నారు. శనివారం ఈ నేపథ్యంలో తహసీల్దార్‌ను రెవెన్యూ ఉద్యోగులు సన్మానించారు.కార్యక్రమంలో తిరుపతి డివిజన్ వీఆర్‌ఓల సంఘం అధ్యక్షుడు చెంగల్‌రాయల్ పాల్గొన్నారు.

శనీశ్వరునికి ప్రత్యేక పూజలు

రామచంద్రాపురం: రాయలచెరువుపేట సమీపంలోని ఛాయాపురంలో వెలసిన శ్రీశనీశ్వరుని ఆలయంలో స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి తైలాభిషేకం, సుగంధ ద్రవ్యాలు, పంచామృతంతో అభిషేకాలు చేశారు.

శాసనసభలో

మూగనోము!



తిరుపతి ప్రజల ఆశలు అడియాసలయ్యాయి. చంద్రగిరివాసుల ఆకాంక్షలు ఆవిరయ్యాయి. నమ్మి గెలిపించిన నేతలు మూగనోము పట్టడంతో అంచనాలు తలకిందులయ్యాయి. ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుంచి అది చేస్తాం.. ఇది చేస్తాం అని ఊదరగొట్టిన ఎమ్మెల్యేలు అసెంబ్లీలో నోరు మెదపకపోవడంతో జనం మైండ్ బ్లాంక్ అయ్యింది. స్థానిక సమస్యల ప్రస్తావనే తీసుకురాకపోవడంతో దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. ఒక్కసారైనా నియోజకవర్గ అభివృద్ధిపై గళం విప్పుతారనుకుంటే చివరకు నిరాశే మిగిలింది. అధినేతలను ప్రసన్నం చేసుకునేందుకు చూపే శ్రద్ధలో ఆవగింజంతైనా ప్రజావాణి వినిపించడంలో చూపించకపోవడం దారుణమని ప్రజానీకం మండిపడుతోంది.

- అసెంబ్లీలో నోరు మెదపని తిరుపతి, చంద్రగిరి ఎమ్మెల్యేలు ఆరణి, పులివర్తి
- సమస్యల పరిష్కారం సంగతి దేముడెరుగు.. అసలు ప్రస్తావనే లేదు
- సొంత పనులు.. సన్మానాలకే పరిమితం
- అభివృద్ధి పనులపై మాట్లాడతారని ఎదురుచూసిన ప్రజానీకం
- ఆకాంక్షలను వినిపించలేకపోవడంపై సర్వత్రా అసహనం



ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని

తిరుపతి సిటీ: అసెంబ్లీ సమావేశాల్లో తిరుపతి, చంద్రగిరి అభివృద్ధి, సమస్యలపై కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులు ప్రస్తావిస్తారని రెండు నియోజకవర్గాల ప్రజలు ఎంతో ఆశగా ఎదురు చూశారు. కానీ, వారికి నిరాశే మిగిలింది. సొంత పనులు, సన్మానాలు చేయడం, చేయించుకోవడంపైనే మన ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాల సమయంలో బిజీబిజీగా గడిపారు. మంత్రులను, పార్టీ పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమైన ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల సమస్యల ప్రస్తావనే తీసుకురాలేదు. కనీసం మాట వరసకైనా ప్రజావాణిని అసెంబ్లీలో వినిపించలేదు.

సమస్యలు గాలికి..!

తిరుపతిలో ప్రధానంగా డ్రైనేజ్ వ్యవస్థ, తాగునీటి సమస్యపై ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అసెంబ్లీలో గళమెత్తుతారని నగరవాసులు టీవీలకు అతుక్కుపోయారు. అయితే ఆయన మాత్రం ప్రజాసమస్యలను పట్టించుకున్న దాఖలాలు లేవు. సభ దృష్టికి సమస్యలను తీసుకెళ్లినప్పుడే సత్వర పరిష్కారానికి అవకాశం ఉంటుంది. కానీ, ఆ దిశగా ఎమ్మెల్యే ఆరణి ఒక్క అడుగు కూడా ముందుకు వేసినట్లు కనబడలేదని పలువురు విమర్శిస్తున్నారు. అదే రీతిలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సైతం అసెంబ్లీ సమావేశాలను సొంత పనులకే వాడుకున్నారు. పార్టీ అధినాయకులను, మంత్రులను కలవడం తప్ప ప్రజల సమస్యలపై అసెంబ్లీలో నోరు మెదపలేదు. కొత్తగా అసెంబ్లీలోకి అడుగుపెట్టిన ఆయన చంద్రగిరి నియోజకవర్గ సంక్షేమం, అభివృద్ధి, సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లేందుకు కనీసం ప్రయత్నించి ఉంటే బావుండేదని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.

అసెంబ్లీలో ప్రస్తావించాల్సింది



తిరుపతి నియోజవర్గంలో అత్యవసరంగా చర్చించాల్సిన సమస్యలు రెండు ఉన్నాయి. పాత డ్రైనేజ్ వ్యవస్థతో రోడ్లపై నడవలేని పరిస్థితి ఉంది. రెండోది తాగునీటి సమస్య. నగర ప్రజలకు రెండు మూడు రోజులకు ఒకసారి కూడా తాగునీరు అందడం లేదు. వీటిని అసెంబ్లీలో ప్రజాప్రతినిధి ప్రస్తావిస్తారని ఆశించాం. అది జరగకపోవడం దురదృష్టకరం. నగర సమస్యల పరిష్కారానికి టీటీడీని సైతం భాగస్వామ్యం చేస్తే బావుంటుంది. అది అసెంబ్లీలో చర్చతోనే సాధ్యం. వచ్చే అసెంబ్లీ సమావేశాలలో అయినా ఆయన నగర ప్రజల వాణిని వినిపిస్తారని ఆశిస్తున్నాం.

–వెంకటరెడ్డి, తిరుపతి నియోజకవర్గం

సద్వినియోగం చేసుకోవాల్సింది



నూతన ఎమ్మెల్యేగా పులివర్తి నాని తొలిసారి అసెంబ్లీలోకి ప్రవేశించడం సంతోషం. అదేవిధంగా చంద్రగిరి నియోజకవర్గ సమస్యలపై ఆయనకు మంచి అవగాహన ఉంది. ప్రజల కోరిక మేరకు అసెంబ్లీ సమావేశాలలో నియోజకవర్గ సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను శాసనసభలో ప్రస్తావిస్తారని అనుకున్నాం. కానీ, ఆయన మా ఆశలను నెరవేర్చలేదు. కనీసం ఒక్కమాట కూడా మాట్లాడలేకపోవడం బాధగా ఉంది. ప్రజలు అందించిన అవకాశాన్ని ఆయన సద్వినియోగం చేసుకోవాల్సింది. తర్వాత వచ్చే శాసనసభ సమావేశాల్లో అయినా ప్రజల తరఫున గళమెత్తాలని కోరుతున్నాం.

–సుబ్బరామయ్య, చంద్రగిరి నియోజకవర్గం

కార్తీక బ్రహ్మోత్సవాలపై సమీక్ష

చంద్రగిరి (తిరుచానూరు): తిరుమల తరహాలో తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు నిర్వహించాలని టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు. శనివారం తిరుపతి టీటీడీ పరిపాలన భవనంలోని జేఈఓ కార్యాలయంలో బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. జేఈఓ మాట్లాడుతూ నవంబరు 28 నుంచి డిసెంబర్ 6వ తేదీ వరకు కార్తీక బ్రహ్మోత్సవాలు జరిపించనున్నట్లు వెల్లడించారు. పంచమి తీర్థం నాడు లక్షలాది మంది భక్తులు విచ్చేసి పుణ్యస్నానాలు ఆచరించనున్నందున ఆ మేరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో ఎస్వీబీసీ సీఈఓ షణ్ముఖ కుమార్, సీఈ నాగేశ్వరరావు, డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, అదనపు ఆరోగ్యశాఖ అధికారి సునీల్ కుమార్, వీజీఓ బాలిరెడ్డి పాల్గొన్నారు.

రూ.50లక్షల పరిహారానికి డిమాండ్

తిరుపతి కల్చరల్: శ్రీకాళహస్తిలోని ల్యాంకో యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడు మద్దు ప్రసాద్ కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యాయుడు రాయపనేని హరికృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. 2002 నుంచి ఈ ఫ్యాక్టరీలో అనేక మంది కార్మికులు మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పరిశ్రమశాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించాలని స్పష్టం చేశారు.

కుమార్తె వైఖరిపై కన్నతండ్రి ఆక్రోశం



మాట్లాడుతున్న మునస్వామి నాయుడు

తిరుపతి కల్చరల్: టీడీపీ అధికార ప్రతినిధి లత తమ ఆస్తిని కాజేయాలని ప్రయత్నిస్తోందని ఆమె తండ్రి కిలారి మునస్వామి నాయుడు ఆరోపించారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కన్నతండ్రి అనే మమకారం కూడా లేకుండా రూ.10 కోట్ల ఆస్తిని కబళించేందుకు తమను తీవ్రంగా ఇబ్బంది పెడుతోందని మండిపడ్డారు. తన కుమారుడు శివశేఖర్‌నాయుడు న్యూజీలాండ్‌లో వ్యాపారం చేస్తున్నాడని, అక్కడ నుంచి పంపిన నగదుతో ఇక్కడ ఆస్తులు కూడబెట్టామన్నారు. తన భార్య కిలారి మల్లీశ్వరి పేరు మీద పుత్తూరు దగ్గర తడుకులో మామిడితోట, రేణిగుంట మార్గంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్, తిరుపతి కర్నాలవీధిలో 30 అంకణాల ఇల్లు కొనుగోలు చేశామని వివరించారు. అయితే తమ చిన్న కుమార్తె సూర్యదేవర లత, అల్లుడు సూర్యదేవ లలిత ప్రభాకర్‌నాగ్ కుట్రపూరితంగా తన భార్య మల్లీశ్వరికి మాయ మాటలు చెప్పి ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సుప్రీం కోర్టు వరకు వెళ్లి ఆస్తులను తిరిగి తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నామని చెప్పారు. అయితే టీడీపీ అధికారంలోకి రావడంవతో లత మళ్లీ రెచ్చిపోతోందని, ఆ పార్టీ నేతల అండ చూసుకుని బెదిరింపులకు దిగుతోందని తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి, హోంమంత్రి, డీజీపీకి లేఖల ద్వారా ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న వైభవం



తిరుచ్చిపై ఊరేగుతున్న దేవదేవేరులు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులకు దర్శనమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు సమర్పించారు. శ్రీవారికి అభిషేక సేవ చేపట్టి వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుద్దీప కాంతుల నడుమ దేవదేవేరులకు ఊంజల్ సేవ జరిపించారు. సర్వాలంకర శోభితుడైన శ్రీనివాసుడు, అమ్మవార్లతో కలసి బంగారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ వెంకటస్వామి, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

టేప్ ఎక్స్‌పో ప్రారంభం



రామానాయుడిని సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: ప్లానర్స్ అండ్ ఇంజినీర్స్ అసోసియేషన్ వారు శిల్పారామంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న టేప్ ఎక్స్‌పోను శనివారం ఘనంగా ప్రారంభించారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ కంపెనీలకు చెందిన ఇంజినీరింగ్, మానుఫ్యాక్చరింగ్, ఇంటీరియర్ డిజైన్స్‌కు సంబంధించిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో ప్రజలు ప్రదర్శనకు తరలివచ్చారు. కార్యక్రమానికి అతిథులుగా బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి, టీడీపీ నేతలు నరసింహయాదవ్, మబ్బుదేవనారాయణరెడ్డి, మనోహర్ రాయల్, రామానాయుడు హాజరయ్యారు. టేప్ చైర్మన్ టి.వెంకటేష్‌బాబు, అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి షణ్ముగం, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, కోశాధికారి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నివారణపై అవగాహన



ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

రామచంద్రాపురం: మండలంలోని అనుప్పల్లెలో కుష్టు, క్షయ నివారణ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం కుష్టువ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కుప్పంబాదూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి తేజస్విని తమ సిబ్బందితో కలసి ఇంటింటికీ వెళ్లి లెప్రసీ డిటెన్షన్ సర్వే నిర్వహించారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ శరీరంపై స్పర్శ లేని మచ్చలు, బుడిపెలు, నొప్పిలేని పుండ్లు, చెవి తమ్మెలు మందంగా మారి ముఖంపై నూనె రాసినట్లు జిడ్డుగా నిగనిగలాడే చర్మం ఉండడం వంటి లక్షణాలు ఉంటే కుష్టు వ్యాధి సోకినట్లుగా అనుమానించి సమీపంలోని పీహెచ్‌సీకి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయితే శస్త్ర చికిత్స, మందులు ఉచితంగా అందించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైద్యులు రాజా, రమణ, కిరణ్ కుమార్, ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

ఆటోనగర్ సమస్యల పరిష్కారానికి వినతి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న దేవేంద్రరెడ్డి

తిరుపతి మంగళం: ఆటో నగర్‌లోని సమస్యల పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ స్మాల్ అండ్ మీడియం అసోసియేషన్ (ఎఫ్ఏపీఎస్ఐఏ) అధ్యక్షుడు దేవేంద్రరెడ్డి కోరారు. శనివారం ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. ఆటోనగర్‌లోని సర్వే నంబర్ 74/7లో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు చేతుల మీదుగా ఆటో వర్కర్స్‌కు సేల్ డీడ్ ద్వారా ప్లాట్లు కేటాయించారన్నారు. ఈ క్రమంలో ఆయా స్థలాలపై పదేళ్లుగా ఉన్న 22–ఏ ను తొలగించాలని విన్నవించారు. కార్మికుల స్థలాలు నిషేధ జాబితాలో ఉండడంతో దుకాణాలపై రుణాలు తీసుకోలేకపోతున్నారని వివరించారు. స్పందించిన కలెక్టర్ దీనిపై ఆర్డీఓతో చర్చించి తగు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

రాజ్యాంగ విరుద్ధంగా కొత్త చట్టాలు



మాట్లాడుతున్న న్యాయవాది రాజేంద్రప్రసాద్

తిరుపతి కల్చరల్: దేశంలో నూతనంగా ప్రవేశపెట్టిన చట్టాలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్, విశ్రాంత న్యాయమూర్తి గుర్రప్ప, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు, కార్మిక, ప్రజాసంఘాల నేతలు స్పష్టం చేశారు. శనివారం వేమన విజ్ఞాన కేంద్రంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి అధ్యక్షతన దేశంలో చట్టాల మార్పు వరమా? శాపమా ? అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాలు కొత్త జాడీలో పాత పచ్చడి చందాన ఉన్నాయని విమర్శించారు. పేర్లు, సెక్షన్లు మార్చారే తప్ప ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు తగిన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. లా కమిషన్ చేసిన ప్రతిపాదనలను పట్టించుకోకుండా ఏకపక్షంగా చట్టాలను ఆమోదించిందని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయమూర్తి గుర్రప్ప మాట్లాడుతూ పోలీసులకు సర్వాధికారాలు కట్టబెట్టడం ప్రమాదకరమని హెచ్చరించారు. నర్సింగరావు మాట్లాడుతూ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. వివిధ సంఘాల నేతలు రాధాకృష్ణ, రత్నకుమార్, అంబురి సింధూజ, వందవాసి నాగరాజు, జీబీఎస్ మణ్యం, న్యాయవాదులు చల్లా వెంకటయ్య, పత్తికొండ మురళి, మల్లారపు నాగార్జున పాల్గొన్నారు.

అబ్దుల్ కలామ్‌కు నివాళి



కలామ్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

తిరుపతి గాంధీ రోడ్డు: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం తిరుపతిలో ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ నేత గుండాల గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో కలామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. నాయకులు సుబ్రమణ్యం, యాదవ్, జనార్ధన్ రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, చెంగారెడ్డి, పనిభూషణ రెడ్డి, హరినాథ్, కన్నప్ప గారి కేశవరెడ్డి, కళాకారుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

ఆడికృత్తిక ఉత్సవాలు ప్రారంభం

పాకాల: మండలంలోని ఉప్పరపల్లె పంచాయతీ ఊట్లవారిపల్లె సమీపంలోని పాళ్యం కొండపై వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపించారు. ఎమ్మెల్యే పులివర్తినాని పాల్గొన్నారు. బ్రహ్మదయం 10.30 గంటలకు అక్కగార్ల పూజ, సాయంత్రం 4 గంటలకు గణపతి పూజ, కంకణధారణ, పుణ్యహవచనం, వాస్తుశాంతి, అంకురార్పణం, కలశస్థాపన హోమం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు మూషిక వాహనంపై వినాయకస్వామిని ఊరేగించారు. ఏటుకూరి వెంకట్ లలిత, బొల్లినేని కృష్ణమనాయుడు, బొల్లినేని అశోక్ దంపతులు, సరితా రామచంద్ర నాయుడు దంపతులు, రాంబాబునాయుడు, కోరా ప్రకాష్‌నాయుడు, ఆర్.నారాయణస్వామి, మదురాచ్చారి దంపతులు, శ్రీనివాసరెడ్డి దంపతులు, మురళీ నాయుడు దంపతులు, వారి సోదరులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

31న ఫొటోగ్రఫీ వర్క్‌షాప్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నేతలు

తిరుపతి కల్చరల్: తిరుపతి తిరుమల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదీన లక్ష్మీపురం సర్కిల్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ప్రొఫెషనల్ ఫొటో గ్రఫీపై నికాన్ వారు వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు పూసపాటి మోహన్‌రాజ్ తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన వర్క్‌షాపు పోస్టర్ ఆవిష్కరించారు. మోహన్‌రాజ్ మాట్లాడుతూ గత 32 ఏళ్లుగా ఫొటోగ్రాఫర్స్ సంక్షేమంతో పాటు వారి వృత్తి నైపుణ్యాల పెంపుపై అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా ఆధునిక టెక్నాలజీతో రూపొందిన కెమెరాలపై మరింత అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ వర్క్‌షాప్‌కు ఫొటో గ్రాఫర్లందరూ హాజరుకావాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సతీష్‌కుమార్, ప్రతినిధులు రహంతుల్లా, పురంధర్, రమణ, కృష్ణ, రాధాకృష్ణ, రాజు పాల్గొన్నారు.

ఘనంగా పర్యావరణ దినోత్సవం



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

చంద్రగిరి: స్థానిక ఆర్ఎఫ్ రోడ్డులోని బ్లూమింగ్ బడ్స్ పాఠశాలలో శనివారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. భావితరాలకు కాలుష్య రహిత ప్రకృతిని అందించేందుకు బాలబాలికలకు అవగాహన, స్ఫూర్తి కలిగించాలని ఉద్దేశంతో నర్సరీ నుంచి యుకేజీ విద్యార్థులకు గ్రీన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలు అందరూ పచ్చని దుస్తులతో వచ్చి పచ్చని చెట్ల వల్ల కలిగే లాభాలను, ప్రయోజనాలను ఆటపాటల రూపంలో వివరించారు. అదే విధంగా 1 నుంచి 5వ తరగతి విద్యార్థులందరూ పర్యావరణ పరిరక్షణపై చిత్రలేఖనం ద్వారా వారి భావాలను వ్యక్తపరిచారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ హితేంద్రనాథ్ రెడ్డి, ప్రిన్సిపల్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

‘పార్కింగ్’ రోడ్..!



ఇరుకు దారిని విస్తరించారు.. చక్కగా రోడ్డు నిర్మించారు.. వాహనాల రాకపోకలకు ఇబ్బంది తప్పించారు.. హమ్మయ్యా అని జనం ఊపిరిపీల్చుకునేలోపు కొత్త సమస్య తలెత్తింది. నూతన రహదారి కాస్తా కార్ల పార్కింగ్‌గా మారిపోయింది.. దీంతో వాహనదారుల కష్టం మళ్లీ మొదటికొచ్చింది. తిరుపతి భవానీనగర్ సమీపంలోని టీటీడీ ఏడీ బిల్డింగ్ పక్కనే ఈ రోడ్డు ఉంది. నగరవాసుల సౌకర్యార్థం నిర్మించిన విశాలమైన మార్గం ఇప్పుడు కొందరు తమ కార్లు నిలిపేస్థలంగా తయారైంది. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి మార్గం సుగమం చేయాలని స్థానికులు విన్నవిస్తున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

